
మళ్ళీ మళ్ళీ

"సావిత్రి అని పేరు పెట్టగానే పతివ్రత అవుతుందేం? కావయ్య పెద్ద కూతురు మొగుడు పోయాడు. పెళ్ళయి గట్టిగా నెల కాలేదు."

బోడి కవలమ్మ (బోడి అన్నది ఇంటిపేరు) ఈ మాట అన్నదని ఎవరో ఒకరు కావయ్య ఇంటికి చేరేశారు. కవలమ్మ మీద శాపనార్థాల వర్షం కురిపించారు. ఈ సంగతికూడా కవలమ్మకు చేరే ఉంటుంది. అయితేనేం? కవలమ్మ నాలు గూళ్ళ మనిషి. పది పడగల మనిషీను. ఆవిడ వాక్ స్థానమందు ఏదేవో ఉండరాని గ్రహం ఉన్నది మరి.

"పసుపూ పారాణీ చెరక్కముందే పుస్తె తాడు పుటుక్కుమని తెగిందని మే వేడుస్తుంటే ఈ బోడిముండ కిదేం పోగాలం?" అన్నది సావిత్రి తల్లి.

"సుక్షేత్రమైన మాగాణీ మూడెకరాలు ముదనష్టంచేసి పెళ్ళిచేశాను. చివరకు ఏడికెటు వాడికి మిగిలింది" అన్నాడు సావిత్రి తండ్రి.

అసలప్పుడే ఏ లోటుపాటూ ఉన్నట్టు సావిత్రికి అనిపించలేదు. ఈ పెళ్ళి తనకు వద్దని చెప్పేసింది. ఒక్కడూ విన్నాడు కాదు." నీ మొహం, నీ కసలేంతెలీదు. నువ్వూరుకో. ఈసమ్మంధం వొదులుకుంటే నీ కుంటాడికో, గుడ్డాడికో ఇచ్చి చెయ్యాలి సొస్తుంది"......

"మొగుడైతే ఏమిటి? ఈడొచ్చిన ఆడపిల్లకి ఏమే! వొసే! అనేవాడొకడుండడం ముఖ్యం. ...ఈ మాటల కేంలెద్దురూ. నిక్షేపం లాంటి సంబంధం! కాకపోతే కాస్త —"

ఈ విధంగా ఒకటే అన్నారు. మొగుడితో పరిచయంవయాక సావిత్రికి అన్ని అభ్యంతరాలూ పోయాయి. కరుణాకరం చెడ్డవాడు కాడు. భార్యమీద అధికారంచేసే రకంకాదు. మంచినీళ్ళలాంటివాడు. ఎవరినీ ఎదిరించేవాడు కాడు. అతనికి దేన్నిగురించీ ఒక బలమైన అభిప్రాయంలేనట్టు కనబడేవాడు. సావిత్రి అతన్నిచూసి ఇష్టపడటం నేర్చుకుంటూఉన్న సమయంలో అతను కాస్తా పోయాడు.

తనలో పాతివ్రత్యం ఏం తక్కువయిందో సావిత్రికి కొంచెంకూడా అర్థంకాలేదు. తాను భర్తని దేవుడల్లేచూసి పూజచేస్తే పోయే వాడుకాడా? సినిమాల్లోలాగా ఆమె భర్తపాదాలు ఎన్నడూ కళ్ళ కద్దుకోలేదు. అదొక వేళ తన వల్ల తప్పయిందేమో?

ఇంతకూ సావిత్రికి పాతివ్రత్యం గురించి ఆటే తెలీదు. మొగుడు చావకుండా ఉండే టట్టుగా చేయలేక పోయినందుకు పశ్చాత్తాప పడదలచినా ఆమెకు సాధ్యం కాలేదు. భర్త పోయినప్పుడు అందరూ ఏడిచినట్టే తనూ ఏడిచింది. అయితే ఏడవటం పాతివ్రత్య మనుకోవడానికిలేదు. ఏ ఏడిచే దాని మొగుడూ రాలేదు. సావిత్రి ఏడిచింది సగం భయంతో. సగం తన కేదో అన్యాయం జరిగిపోయిందన్న విచారంతో.

బొట్టూ, మంగళసూత్రాలూ పోయినందుకు కూడా సావిత్రి విచారించలేదు. అద్దంలో చూసు కుంటే మొహం ఏదో వెలితిగా ఉండేది. పూలుకూడా పెట్టుకోవద్దన్నారు. అదే కాస్త బాధపెట్టింది. సావిత్రికి పూలంటే ఇష్టం.

సావిత్రి వితంతువైన రెండు వారాలకు ఆమె రెండో మేనమామ వచ్చాడు. ఆయన మిగిలిన వాళ్ళలాగా ఏడుపుగొట్టు మాటలు మాట్లాడక, "చిన్నపిల్ల మళ్ళీ పెళ్ళి చేసేస్తే సరి. మొగుడితో ఎంతకాలం కాపురం చేసిందీ? మూడువారాలా? ఇంతేకద? లక్షణమైన పిల్ల. కళ్ళకద్దుకు చేసుకుంటారు" అన్నాడు.

సావిత్రి మనస్సుకు అంత బలం ఇచ్చేటట్టు మాట్లాడిన వారు మరొకరులేరు. రెండో పెళ్ళి కోసం సావిత్రి తహ తహ లాడుతున్నదని కాదు; మిగతావాళ్ళు గతం గురించి ఆలోచిస్తుంటే తన చిన్నమామయ్య భవిష్యత్తు గురించి ఆలోచించాడు. భవిష్యత్తంటే ఆశకు మారురూపం.

నిజానికి సావిత్రి మనస్సులో గతం శీఘ్రంగా చెరిగి పోతున్నది. తన పెళ్ళినాటి దృశ్యాలూ. తన భర్త చచ్చిపోయిననాటి దృశ్యాలూ ఇంకో జన్మకు సంబంధించినట్టుగా అనిపిస్తున్నది.

"నాకు చదవాలని ఉన్నదమ్మా" అని తల్లితో అన్నది కూడానూ.

"ఇహ చదు వొక్కటే తక్కువ నీ జన్మకి" అన్నది తల్లి. తన కూతురు గతాన్ని అంత తేలికగా మరిచిపోవటం ఆవిడకు చాలా తప్పుగా తోచినట్టుంది.

తల్లి ఆ మాట అన్నాక సావిత్రి ఎవరితోనూ భవిష్యత్తు గురించి తన ఆలోచనలు చెప్పలేదు. ఆ ఆలోచనలలో మళ్ళీ పెళ్ళిలేదు- కనీసం ఉన్నట్టు సావిత్రికి తెలీదు. చదివి, డిగ్రీ తెచ్చుకుని, ట్రెయినింగుఅయి, పంతులమ్మ కావటం గురించి కలలుకంటూ ఆమె చాలా కాలం గడిపింది. ఆమె కన్న పగటికలల్లో ఈ పంతులమ్మ కలే ఆనందదాయకమైనది.

## 2

సావిత్రి చెల్లెలు లీలకు సంబంధాలు చూస్తున్నారు. ఎవరో పెళ్ళిచూపులకు వచ్చారు. సావిత్రినిచూసి ఆశగా, "ఈ పిల్లేనాండీ?" అన్నారు. లీలను చూశాక వాళ్ళ మొహాలు ముడుచుకున్నాయి. వెళ్ళి ఉత్తరం రాస్తామని చెప్పి వెళ్ళిపోయారు. ఉత్తరం రాయనేలేదు.

లీల సావిత్రంత బాగుండదు.

"నీ వెధవ మొహం కనిపించకపోతే వాళ్ళు లీలను చేసుకునే వాళ్ళే" అన్నది తల్లి.

మాటలు పడటానికి మనిషి ఏ తప్పు చెయ్యనవసరం లేదన్న సత్యాన్ని సావిత్రి అదివరకు కథల్లో చదివిందిగాని స్వయాన తెలుసుకోవటం బాధ అనిపించింది.

ఎవరూ చెడ్డవాళ్ళు కారు. జీవితం కష్టాలతో కూడుకున్నది. దాన్ని శాసించటం చాతగాని అశక్తతకొద్దీ ఉక్రోషం వచ్చి అందుబాటులో ఉన్నవాళ్ళని కరుస్తాం.

సావిత్రంటే తల్లికి ప్రేమే.

లీలకు సంబంధం కుదిరింది. వేసవిలో పెళ్ళి కూడా అయింది.

స్కూళ్ళు, కాలేజీలూ తెరుస్తున్నారు. "నాన్నా, నేను పియూసీలో చేరుతాను, చేర్పిస్తావా?" అని అడిగింది సావిత్రి.

"పిల్లలందరికీ చెందవలసిన ఆస్తి నీకింద ఇంకా ఏమని ఖర్చుచేసేది, తల్లీ?" అన్నాడు తండ్రి.

తాను నాలుగేళ్ళు చదివి ఏ చిన్న ఉద్యోగం చేసినా ఓ వందరూపాయలు తేవచ్చు. తండ్రి తనకా అవకాశం ఇవ్వక, తనను యావజ్జీవం భరించాలని చూస్తున్నాడు. ఏవంత సబబుగా లేదు.

తండ్రితో చిన్నవాదన చెయ్యటంకూడా సావిత్రికి అలవాటులేదు. అందుచేత తండ్రి వినేటట్టుగా తన అభిప్రాయం తల్లితో చెప్పింది.

"నువ్వు నన్నేమీ పోషించనక్కర్లేదు. నేను నిన్ను ఏదోవిధంగా పోషించలేకపోను!" అని అరిచి, "చదువులూ, ఉద్యోగాలూట!" అని గొణుక్కున్నాడు.

తనను ఎవరో దిగ్బంధం చేసి, చెయ్యీ, కాలూ ఆడకుండా చేస్తున్నట్టనిపించింది. ఎంత హీనస్థితిలోకూడా ఒక పని చెయ్యకుండా ఉండటానికి గాని, రెండు పనులమధ్య ఏదో ఒకటి చెయ్యటానికి గాని స్వేచ్ఛ ఉండాలి. ఆఖరుకు బిచ్చగాడికి కూడా ఒక ఇంటిముందు అడుక్కోకుండా ఉండే స్వేచ్ఛ వున్నది. తనకదికూడా లేదు. గుంజకు కట్టేసిన పశువుకున్నంత స్వేచ్ఛే తనకూ ఉన్నది. ఇంకా బతకపోతే ఇరవై ఏళ్ళో, నలభై ఏళ్ళో, అరవయ్యేళ్ళో తను ఈ ఇంటి ఇన్ని మెతుకులు తింటూ పడి ఉండాలి!

సావిత్రి ఈ ఆలోచనకు దడుచుకున్నది.

ఈ భయం నుంచే ఆమెకు మళ్ళా పెళ్ళి ఆలోచన వచ్చింది. ఆమె ఇంకో మొగుడితో కాపరం చెయ్యటం గురించి కలలు కన నారంభించింది.

అయితే ఆమె ఈ ఆలోచనను ఎవరికీ చెప్పలేదు. అది ఇంకెవరికీ కలగనూలేదు. అయినా సావిత్రి దిగులు పడలేదు. ఈ మళ్ళీ పెళ్ళి గురించి ఆమెకు తొందర ఏమీ లేదు. ఎప్పటికైనా అది జరిగి తీరుతుంది. సహాయం చెయ్యటానికి చిన్నమామయ్య ఉండనే ఉన్నాడు.

కాని, సావిత్రి తొందరపడకపోయినా [illegible] తొందరపడింది. ఒకరోజున పక్కఇంటి భాస్కరాన్ని, ఇరవైఏళ్ళు దాటినవాణ్ణి, తండ్రి పట్టుకుని మక్కెలు విరగదన్నాడు.

భాస్కరం తండ్రిచేత తన్నులు తిన్నది తన

మూలంగానేననివిని సావిత్రి నిర్ఘాంతపోయింది. భాస్కరం సావిత్రి కోసం చాలాకాలంగా ఆకలి గొని ఉన్నాడు. భాస్కరం వాళ్ళ పక్క ఇంటికి అద్దె కొచ్చి అయిదారు మాసాలైనా, భాస్కరాన్ని సావిత్రి ఒక్కసారికూడా సరిగా చూడ లేదు. కాని, పాపం, భాస్కరం రోజూ సావిత్రిని చూసి తనలో పుట్టిన అగ్నికి ఆశలు ఇంధనాలుగా వేస్తూ వ్రాస్తున్నాడు. భాస్కరం వాళ్ళ దక్షిణపు గది కిటికీ దగ్గర నిలబడితే, మధ్య ఉండే ప్రహరీ గోడ మీదుగా, దొడ్లో బట్టలు ఆరేసేటప్పుడూ, ఇతర పనులు చేసే టప్పుడూ సావిత్రి కనిపిస్తుంది.

ఒకనాటి వర్షపువేళ, సావిత్రి దొడ్లోఉన్న సమయంలో భాస్కరం ఒక కాగితపుఉండ గోటితో మీటాడు. కాని ఆ కాగితపుఉండ "సెట్" అయింది.— అంటే గోడకుతగిలి, బౌన్సుకొట్టి, కొంచెం పక్కగా, గోడదగ్గర కాలుకుడుచుకుంటున్న భాస్కరం తండ్రి కుడి చెవికి ఠపీమని తగిలి, భూదేవిని చేరుకున్నది. భాస్కరం తండ్రి కాగితంమడత శ్రద్ధగావిప్పి, భాస్కరం సావిత్రికి రాసిన "ప్రేమలేఖ" కాస్తా చదివాడు. దాంతో కొంప అంటుకున్నాయి.

భాస్కరం తిన్నదెబ్బలన్నీ తిన్నమీదట అతని తల్లి ఆతన్ని వెనకేసుకొచ్చి, "మొగుడు చచ్చిన ముండ పొరుగునఉండి ఏం ఆమాట లాడుతున్నదో! భాస్కరం ఎన్నడూ అటువంటి బుద్ధులెరగడు. స్వతంత్రం ఉందిగనక వాణ్ణిపట్టుకు చావగొట్టారు. వాళ్ళ, వాళ్ళ పిల్లను పల్లెత్తుమాట అంటారేవో చూడండీ. అన్నినీతులూ, నియమము మనకే వచ్చి పడ్డాయి" అన్నది భర్తతో.

ఆవిడ అంతటితో పోనివ్వక సావిత్రిపైన తాచుపాము పగపట్టి, ఆ పిల్ల వీధివీధంతా ఒక కొలిక్కి తెస్తుందని బాజా వాయించసాగింది.

కావయ్య చాంధసుడే కాదు. "నువ్వా భాస్కరం గాడికేసి అదే పనిగా చూస్తున్నావుటె?" అని కూతురి నడిగాడు.

"భాస్కరావెవరు?" అన్నది సావిత్రి ఆశ్చర్యంతోనూ, కోపంతోనూ.

కావయ్య జవాబు చెప్పలేదు. తన కూతురు నిర్దోషి.

తెల్ల బొక్కా కొనుక్కోకండి. వంటదగ్గర ఊరికే మాసిపోతాయ్



భాస్కరం అనేవాడు పక్కింట్లో అద్దెకుండే వాళ్ళబ్బాయనీ. బియ్యే అఘోరిస్తున్నాడనీ, వాడు సావిత్రికి ఉత్తరంరాస్తే అదికాస్తా వాడి తండ్రికి చిక్కిందనీ, సావిత్రికి తల్లి ద్వారా రహస్యంగా తెలిసింది.

తన మూలంగా తన్నులు తిన్నందుకు భాస్కరాన్నిచూస్తే సావిత్రికి జాలివెయ్యలేదు. గాని తనకు వాడేమని ఉత్తరం రాశాడో తెలుసుకోవాలన్న ఆసక్తి ఉపద్రవంగా కలిగింది. కాని ఆ కోరిక ఫలించే ఆశలేదు.

కావయ్య ఒకనాడు తన భార్య చేతిలో ఏదో కథలపత్రిక చూసేడు. ఆయన తన చేతిమీదుగా డబ్బుపోసి పత్రికలు కొనడు, తన భార్య ఎవరి దగ్గిరన్నా అరువుతెచ్చి చదివితే అభ్యంతరం చెప్పడు. ఆయన తన భార్య దగ్గిర తీసుకుని ఆ పత్రికలో ఒకటి రెండు కథలు చదివి. "హోరి వీళ్ళ తల్లికడుపుకాలా! పత్రికల్లో ఇటువంటి కథలు రాస్తున్నారా?" అన్నాడు.

ఆయన గొప్ప సాహిత్యమనుకున్న కాశీ మజిలీ కథల్లోనూ, ప్రబంధాలలోనూ ఇంతకన్న పచ్చి బూతుశృంగారం ఉన్నప్పటికీ, అవన్నీ వాడుకభాషలో లేకపోవటంచేతో ఏవో అంతగా పట్టియ్యలేదు. కాని వీళ్లు బతికున్నవాళ్ళ భాషలో అమ్మాయిల అబ్బాయిలమధ్య ప్రేమ గురించి ఇంత బాహాటంగా రాసేస్తూండటం కావయ్యకు పచ్చికలిగా కనబడింది.

"ఇదుగో, చూడూ!" అన్నాడాయన భార్యతో. "ఈసారికి ఎవడో మనమ్మాయికి ప్రేమలేఖ రాశాడు. రేపు మనమ్మాయే ఇవతల పక్కింటివాడికి ప్రేమలేఖ రాస్తుంది. ఏం చేసేట్టు? ఈ దిక్కుమాలిన కథలు చదివే వాళ్ళు ప్రేమలేఖలు రాయటం అబ్బురంవా?"

"చాల్లే.ఊరుకోండి. కథల్లో ఉన్నట్లు ఎవరూ చెయ్యరు. కథలువేరూ, బతుకులువేరూనూ!" అని కావయ్యభార్య వివరించింది.

"ఏడిసినట్టే ఉంది. ఓ చెంప ఆ భాస్కరంగాడు ప్రేమలేఖరాసి మక్కెలు విరగదన్నించుకుంటే, ఎవరూ అటువంటి పనులు చెయ్యరంటావేం?" అన్నాడు కావయ్య.

"వాడి మాటేంటో, మనమ్మాయటువంటి వెధవపన్లు చెయ్యదు."

"ఆ భాస్కరంగురించి వాళ్ళమ్మా ఆ మాటే అన్నది."

కావయ్య భార్యకు చిరాకెత్తుకొచ్చింది.

"అయితే ఏంచేద్దామంటారు? అది ఎప్పుడో ఏదో చెయ్యబోతుందని ఇప్పుడే తంతానంటా రేవిటి?"

"తన్నటం దేనికీ? పెళ్లి చేసేస్తా ... మీ చిన్న తమ్ముడు మళ్ళీ ఆ మాటే రాశాడు."

"పెళ్లా!" అంటూ కావయ్య భార్య నోరు వెళ్ళబెట్టింది.

"అవును. ఏం? నేను పుట్టక ముందు నుంచీ వితంతువుల పెళ్ళిళ్ళు జరుగుతూనే ఉన్నాయి".

"చిన్నతనంలో మొగుడుపోతేనే పెళ్ళి చేసుకునే వాళ్ళు కరువుగదా, కొన్నాళ్ళు కాపురం చేసిన దాన్నెవరు చేసుకుంటారండీ?"

"చేసుకునేవాడి కభ్యంతరం లేకపోతే నీకూ నాకూ దేనికీ!" అని కావయ్య విసుక్కున్నాడు.

* * *

ఆ ముసలాయన పెళ్ళిచూపులకు వచ్చేదాకా తన పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నట్టు సావిత్రి ఎరగదు. ఆయన పత్రికలో వధువు కావాలని ప్రకటన వేశాట్ట. అందులో తన వయస్సు నలభై దాటాయనీ, తాను విధురుణ్ణనీ, తనకు పిల్లలున్నారనీ, ఏటా పది వేలు ఆదాయం వచ్చే ఆస్తి ఉన్నదనీ ప్రకటనలో తెలియజేశాట్ట. కావయ్య ఆ ప్రకటనకు జవాబిచ్చిన మీదట ఆయనే చేతి కర్రతో, జరీ ఉత్తరీయంతో, కొద్దిగా మాసిన గడ్డంతో బయలుదేరి చక్కా వచ్చాడు.

సావిత్రిని ఆయనకు చూపించారు. సావిత్రి ఆయనను చూసింది. ఆయనకు నలభై దాటిన మాట అబద్ధంకాదు. కాకపోతే నలభై దాటి చాలా ఏళ్ళయినట్టు కనబడింది. ఆయన ఉత్త విధురుడు కాదు. ద్వివిధురుడు. మూడో మంగళసూత్రం అరిటిచెట్టుకు కట్టి, దాన్ని వధ చేసి, నాలుగో మంగళసూత్రం

సావిత్రికి కట్టే ఆలోచనలో ఉన్నాడు. ఇక పిల్లల మాటా? మొత్తం ఆరుగురు పిల్లలున్నప్పటికీ అందర్నీ సావిత్రి పోషించవలసిన అవసరం లేదు. ఇద్దరాడపిల్లలు కాపరాలకు వెళ్ళిపోయారు. పెద్దకొడుకు భార్య కాపరానికి వచ్చింది. గనక, సావిత్రిపైన సంసారభారమంతా పడుతుందనే భ౦యుంలేదు.

పెళ్ళికొడుక్కు పెళ్ళికూతురు నచ్చింది. పెళ్ళికొడుకు పెళ్ళికూతురి తల్లిదండ్రులకు నచ్చాడనే చెప్పవచ్చు.

"రెండో పెళ్ళిదాని కింతకన్న మంచి సంబంధం వస్తుందిటండీ? ఆస్తి కూడా ఉందిట. కాస్త వయసు మళ్ళినవాళ్ళే పెళ్లాలని బాగా చూసుకుంటారటగా?" అన్నది సావిత్రి తల్లి.

"నే నాలోచిస్తున్నది అది కాదు. ఇంకో సంబంధం రావటానికిన్నేళ్ళు పడుతుందోనని. ఎంత త్వరగా పెళ్ళి అయిపోతుందోనని. ఎంత త్వరగా పెళ్ళిఅయిపోతే అంత మంచిది" అన్నాడు కావయ్య.

ఎవరికి మంచిదో ఆయన అనలేదుగాని, ఆయన తన విషయం ఆలోచించడం లేదని సావిత్రికి అనుకున్నది.

సావిత్రికి పెళ్ళికొడుకు కొంచెం కూడా నచ్చలేదు.

"నాకీ పెళ్ళి చేసేకన్న తలగొరిగించి, ముసుగువేసి మూలకూర్చోబెట్టండి" అన్నదామె తల్లిదండ్రులతో.

ఇది జరిగాక వేసవి సెలవులకు సావిత్రి చిన్న మేనమామ వచ్చాడు. కావయ్య తన బావమరిదితో కూతురిపైన ఫిర్యాదు చేశాడు.

చిన్న కావయ్య అంతావిని, "ఛ. ఛ! అదేం సంబంధం, బావా? నీ కూతురు కుంటిదనుకుంటున్నావా? గుడ్డిదనుకుంటున్నావా? నిక్షేపంలాటి పిల్లను అనాధకన్న అన్యాయంగా చూస్తున్నావేఁవిటి?" అన్నాడు.

చిన్నమాఁవయ్య ఎప్పుడే మాట అన్నా సావిత్రికేదో బలం వచ్చినట్టుంటుంది.

"నాయనా, నీ మేనగోడలికి నవయువకుణ్ణీ, నవమన్మధుణ్ణీ, నవకుబేరుణ్ణీ తీసుకురావటం






నా చాతకాదు. నీకు చాతనైతే తీసుకురా! నా వొద్దన్ను!" అన్నాడు కావయ్య.

"దాన్ని నాతోపంపించు. నవమన్మధుడైనా కాకపోయినా, కాస్త నాగరికతా సంస్కారాలు గలవాణ్ణి చూసి ముడిపెట్టేస్తాను" అన్నాడు చిన్నమావయ్య.

* * *

ఆ విధంగా సావిత్రి పట్నం చేరింది. ఆమె కిప్పుడు కొత్త జన్మ ఎత్తినట్టున్నది. ఇందులోని మంచికి అలవాటు పడేదాకా లోపాలు తెలియవు గనక, సావిత్రి తానిప్పుడు నిజంగా జీవిస్తున్నాననీ, నిజంగా గాలి పీలుస్తున్నాననీ అనుకున్నది. అదివరకెన్నడూ భవిష్యత్తు గురించి లేని ఆశలు ఆమెలో పుట్టుకొచ్చాయి.

ఈ ఆశలు ఒకనాడు తలవని తలంపుగా అకస్మాత్తుగా వికసించాయి. ఆరోజు సాయంకాలం అయిదు గంటలవేళ సావిత్రి గేటు దగ్గిర నిలబడి మల్లెపూలు అమ్మే వాళ్ళకోసం చూస్తున్నది. (ఆమె పూలూ, బొట్టూకూడా పెట్టుకోవటానికి చిన్నమావయ్య అనుమతి ఇచ్చాడు.) ఇంతలో వీధిదాటి ఒక యువకుడు ఆమెకేసి వచ్చి, మాటా పలుకూ లేకుండా ఆమె మొహంకేసి చూడసాగాడు.

అనేకసార్లు చూసిన మొహం-కాని ఎవరో. ఎచ్చినా జ్ఞాపకం రావటం లేదు.

"ఎవరు? ఎవరు కావాలి!" అని సావిత్రి తడబడుతూ అడిగింది.

"ను వు కా వా లి...నీ మొహాన బొట్టు! ఎంత మారిపోయింది మొహం!"

సిగ్గుతో సావిత్రి మొహం ఎర్రబడింది. శరీరమంతా కంపించింది.

"నేను భాస్కరాన్ని, గుర్తుపట్టలేదా?" అన్నాడతను, అతని గొంతూ వణుకుతూనే ఉన్నది.

"నువ్వా? నువ్వా భాస్కరమంటే?" అన్నది సావిత్రి, ఆశ్చర్యంలో బిడియపడటం కూడా మరిచిపోయి.

ఒక్క నిమిషమే కాలం స్తంభించింది. కాని స్తంభించిన నిమిషం యుగంతోసమానం.

"నేను లోపలికి రావచ్చా! మీ మావయ్యతో మాట్లాడాలి."

సావిత్రి గేటు తెరిచి, భాస్కరం లోపలికి రావటానికి దారి యిచ్చింది.

ఇద్దరూ వరండాలోకి వచ్చారు.

"కూర్చో" అంటూ సావిత్రి కుర్చీ చూపించి, "అన్నట్టు మా మావయ్య ఇంకా ఆఫీసునుంచి తిరిగిరాలేదు."

"నీవుకూడా కూర్చో. మీ మావయ్యతో మాట్లాడేముందు నీతో మాట్లాడాలి" అన్నాడు భాస్కరం.

సావిత్రి అతని ప్రక్క కుర్చీలో నే కూర్చున్నది.

"ఒకప్పుడు నీకో ఉత్తరం రాశాను. అది నీ కందలేదు - మా నాన్నకందిం" దన్నాడు భాస్కరం.

"విన్నాను. అందులో ఏం రాశావు?" సావిత్రికి బిడియంతోబాటు నవ్వొచ్చింది.

"ఏమో నాకిప్పుడు జ్ఞాపకం లేదు. మా నాన్న నన్ను తన్నాడు. న్యాయంగా నేనే ఆయన్ని తన్నాలి. ఒకరి ఉత్తరం మరొకరు చదవటం చాలా వెధవ పని. నేను నిన్ను లవ్ చేశాను. ఆ సంగతి నీకు తెలియజెయ్యటం తప్పా. ఆ ఉత్తరంలో నిన్నే తప్పుడు పనీ చెయ్యమని నేను అడగలేదు. నన్ను పెళ్ళి చేసుకుంటావా, సావిత్రీ? నువు లేకపోతే నాకు

జీ వి త మే లేదనిపి స్తున్నది. అది అర్థంలేని ఐడియా" అని నాకుతెలుసు. కాని నా మనస్సును ఒ ప్పిం చ లే కుం డా ఉన్నాను. మనం పెళ్ళాడితే ఆ స్టుపిడ్ ఐడియా పోతుంది. లేదా నిజమవుతుంది !"

భాస్కరం ఆగాడు. సావిత్రి తలవంచుకుని ఏమీ అనలేదు. ఆమె కతని ధోరణి అర్థం కూడా కాలేదు—తనను పెళ్ళాడమని అడుగు తున్నాడని తప్పి స్తే. అతనే మళ్ళీ మాట్లాడ సాగాడు.

"నీ కా లెటర్ రాశానని మా నాన్న నన్ను ఎంత గాడిదకింద జమకట్టాడు. నేను తెలివి తక్కువవాణ్ణి కాను, సావిత్రీ. కనీసం మా నాన్నకన్న చాలా తెలివిగలవాణ్ణి. ఆయన నా పెళ్ళిచేస్తే నా గతి ఏఁవిటో ఆలోచించు. నీకు ఉత్తరం రాస్తేనే ఊరుకోని వాడు, నిన్ను పె ళ్ళా డ తా న ం టే ఒప్పుకుంటాడా? నువు నన్ను చేసుకోనంటే తప్ప నాకింకొకతెను పెళ్ళాడాలన్న ఆలోచన కూడా రాదు. ఏం చెయ్యాలి ?"

ఇద్దరూ చాలాసేపు మాట్లాడలేదు.

"మా మావయ్య వస్తాడు. ఆయన సలహా అడిగి చెబుతాను" అన్నది సావిత్రి.

భాస్కరం నవ్వాడు.

"ఆయన చేసుకోమంటే చేసుకుంటావు. వద్దంటే మానేస్తావు ? అంతేనా ?"

అతనామాట అ నే దా కా భాస్కరాన్ని ఒక అర్భకుడుగానే-తండ్రిచేత అసహాయంగా తన్నులు తిన్నవాడికిందనే-చూసింది. కాని ఇప్పు డామెకు అతనిలో ఏదో బలం ఉన్నట్టు పొడగట్టింది.

"అ దే మీ లే దు. మా మా వ య్య తో నా కిష్టమనే చెబుతాను" అన్నది సావిత్రి.

భాస్కరం ఆమె చెయ్యి తీసుకుని గట్టిగా నొక్కాడు.

★

